ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : ఏసీపీ

మలక్‌పేట, జూలై 10 : సురక్షిత ప్రయాణం కోసం ప్రతిఒక్కరూ విధిగా రోడ్డు భద్రత నియమాలను పాటించాలని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్(టీటీఐ) ఏసీపీ జి.శంకర్‌రాజు వైద్య సిబ్బందికి సూచించారు. ట్రాఫిక్ అవేర్‌నెస్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మలక్‌పేటలోని యశోద ఆసుపత్రిలో వైద్య సిబ్బందికి ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రత, మోటార్ వెహికిల్ యాక్ట్ 1988, 2019పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సుమారు 150 మంది వైద్య సిబ్బంది, రిటైర్డ్ డీసీపీ దివ్యచరణ్, ఆసుపత్రి ఆపరేషన్ జఎం గోపాల్‌రావు, ఏజీఎం హేమచంద్రబాబు, ఎల్ అండ్ టీ మేనేజర్ రాజశేఖర్, ఇన్‌స్టిట్యూట్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు పనులను పరిశీలించిన మేయర్

రోడ్డు పనులను పరిశీలిస్తున్న మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి

బడంగ్‌పేట, జూలై 10 : బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్ ప్రధాన రహదారి బీటీ రోడ్డు పనులను కార్పొరేటర్, అధికారులతో కలిసి మేయర్ చిగిరింత పారిజాతనర్సింహారెడ్డి పరిశీలించారు. 19వ డివిజన్‌లో బోనాల పండుగ ఏర్పాటు పనులను పరిశీలించారు. ప్రధాన రహదారులపై గుంతలను పూడ్చివేయడంతోపాటు బోనాల ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. బోనాల పండుగకు భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈ యాదయ్య, కార్పొరేటర్ తోట శ్రీధర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

దోమల నివారణకు ప్రజలను చైతన్యం చేయాలి

- ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్

అధికారులతో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్

ఎల్బీనగర్, జూలై 10 : దోమల నివారణకు ప్రజలను చైతన్యం చేయాలని, డెంగీ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎల్బీనగర్ జోనల్ కమిషనర్,ఐఏఎస్ అధికారి హేమంత్ కేశవ్ పాటిల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ఎల్బీనగర్ జోనల్ కార్యాలయంలో జోన్‌లోని ఐదు సర్కిళ్ల అధికారులతో దోమల నివారణ,సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తతపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో జోనల్ కమిషనర్ మాట్లాడారు. సాధారణ జ్వరాలను కూడా డెంగీగా పేర్కొంటూ కొందరు డాక్టర్లు అన్ని టెస్టులు చేయిస్తున్నారని, అలాకాకుండా ప్రజలకు అవగాహన కల్పించి వారిలో భయాలను పోగొట్టాలని సూచించారు. వైద్యారోగ్యశాఖ, జీహెచ్‌ఎంసీ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎంటమాలజీ విభాగంవారు యాంటీ లార్వా కార్యక్రమాలతోపాటు ఫాగింగ్ చేయాలన్నారు. జోన్ పరిధిలోని అన్ని విద్యాసంస్థల్లో దోమల నివారణ పట్ల అవగాహన కల్పించి విద్యార్థులను వలంటీర్లుగా తీసుకుని అన్ని విద్యాసంస్థలను మస్కిటో ఫ్రీగా మార్చాలని సూచించారు. వార్డుల వారీగా సమావేశాలు, క్యాంపులు నిర్వహించే లిస్టు తయారు చేసుకుని పకడ్బందీగా, సమగ్ర ప్రణాళికతో దోమల నివారణకు ముందుకు సాగాలని పేర్కొన్నారు. కాలనీ సంక్షేమ సంఘాలు, బస్తీ సంఘాలతో పాటు జర్నలిస్టులను, ముఖ్యమైన వ్యక్తులను అవగాహన కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని అధికారులను ఆదేశించారు. సమా వేశంలో జోనల్ కార్యాలయ అధికారులు సువార్త, అశోక్‌రెడ్డి, సీనియర్ ఎంటమాలజిస్ట్ రజినీ, ఉప కమిషనర్లు తిప్పర్తి యాదయ్య, ముకుందరెడ్డి, జకియా సుల్తానా, సుజాత, ఆంజనేయులు,పారిశుధ్య విభాగం, వైద్యాధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న వివిధ విభాగాల అధికారులు

పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి : జడ్సీ

ఉప్పల్, జూలై 10: పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టిసారించాలని ఎల్బీనగర్‌జోన్ జోనల్ కమిషనర్ హేమంత కేశవ పాటిల్ అన్నారు. ఈ మేరకు ఉప్పల్ సర్కిల్ పరిధిలోని చిలుకానగర్ డివిజన్ బీరప్పగడ్డలోని పబ్లిక్ టాయిలెట్స్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని అవసరమైన ప్రదేశాలల్లో బీఓటీ టాయిలెట్లు అందుబాటులోకి తీసుకురావాలని, ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు, ఎల్బీనగర్ జోన్ డిప్యూటీ కమిషనర్ సువార్త, డీఈ చందన, సూపర్‌వైజర్ సుదర్శన్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

మల్లాపూర్, జూలై 10: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ డివిజన్ తిరుమలనగర్ జీహెచ్‌ఎంసీ మైదానం, ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ జి. శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. ప్రజలంతా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్,కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పి. మల్లేష్‌గౌడ్, కార్యదర్శి అమరేంద్రబాబు, శ్రీనివాస్‌రావు, మురళీకృష్ణ, బీఆర్‌ఎస్ నాయకులు జంపాల్‌రెడ్డి, చారి, బాల్‌రాజ్, శేఖర్‌గౌడ్, నిసార్ ఆహ్మద్‌గోరి, తదితరులు పాల్గొన్నారు.

యువకులు రక్తదానం చేయాలి

తలసీమియా బాధిత చిన్నారుల కోసం ఎల్బీనగర్‌లో రక్తదానం చేస్తున్న యువకులు

మన్సూరాబాద్, జూలై 10: రక్తదానం చేసి తలసీమియా బారిన పడిన చిన్నారులను ఆదుకోవాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి పౌరుడిపై ఉందని జైభారత్ జాతీయ ప్రధాన కార్యదర్శి రమణమూర్తి తెలిపారు. ఖదిజ్జాసి ఆత్మ సమర్పణ దీక్ష 2024 విరమణ సందర్భంగా ఖదిజ్జాసి అజాద్ షేక్ పేరిట జైభారత్ ఆధ్వర్యంలో బుధవారం తలసీమియా బాధిత చిన్నారుల కోసం ఎల్బీనగర్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు యువకులు పాల్గొని తలసేమియా సికిల్ సెల్ సొసైటీ వారికి 65 యూనిట్ల రక్తాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రమణమూర్తి మాట్లాడుతూ యువత రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని తెలిపారు. కార్యక్రమంలో జైభారత్ జాతీయ అధ్యక్షుడు సైరా షేక్, జాతీయ కార్యదర్శులు రజని, లోక్‌నాథ్, ఉపాధ్యక్షులు వంశీ, వెంకన్న, నాయకులు మల్లికావల్లభ, త్రినాథదాస్, సుధాకర్, త్రిమూర్తులు, లక్ష్మీశ్వర్, దుర్గారెడ్డి, గణేశ్, రాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

జడ్పీటీసీ, ఎంపీటీసీలకు వీడ్కోలు

మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లను సత్కరించిన దృశ్యం

బడంగ్‌పేట, జూలై 10 : మహేశ్వరం మండలంలోని జడ్పీటీసీ, ఎంపీటీసీల పదవీ కాలం ముగియడంతో బుధవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితాహరినాథ్ రెడ్డిని, ఎంపీటీసీలను పలువురు శాలువాలతో ఘనంగా సత్కరించారు. గత ఐదేండ్ల కాలంలో చేసిన అభివృద్ధి పనులను వారు నెమరువేసుకున్నారు. నిరంతరం ప్రజాసేవలోనే ఉంటామని శపథం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శైలజారెడ్డి, మాజీ ఎంపీపీ సునితాఅంద్యానాయక్, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మంజూరైన అభివృద్ధి పనులను వెంటనే చేపట్టండి

జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శ్రీవాణిఅంజన్

ఆర్కేపురం, జూలై 10 : సరూర్‌నగర్ డివిజన్‌కు మంజూరైన అభివృద్ధి పనులను వెంటనే చేపట్టాలని కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్ బుధవారం జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జేబీ కాలనీలో నాలాను పునరుద్ధరించాలని కోరారు. అదేవిధంగా దెబ్బతిన్న రోడ్డు ప్రాధాన్యతను పరిగణనలోకి తీసుకొని నిధులు మంజూరు చేయాలన్నారు. నాలాల పూడికతీతలు, పారిశుద్ధ్యం, వీధికుక్కల బెడద వంటి సమస్యలను పరిష్కరించాలని జోనల్ కమిషనర్‌ను కోరినట్లు కార్పొరేటర్ విలేకరులకుతెలిపారు.

రౌడీషీటర్లకు పోలీసుల కౌన్సిలింగ్

రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న మీర్‌పేట పోలీసులు

బడంగ్‌పేట, జూలై 10 : బోనాల ఉత్సవాల్లో ఏలాంటి హింసాత్మక ఘటనలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని మీర్‌పేట సీఐ నాగరాజు రౌడీషీటర్లను హెచ్చరించారు. బుధవారం మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో 42 మంది రౌడీ షీటర్లు ఉన్నట్లు గుర్తించగా 16 మంది మాత్రమే కౌన్సిలింగ్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రౌడీషీటర్లు తాము ఉంటున్న అడ్రస్‌ను తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. బోనాల సందర్భంగా తల్వార్లు, కత్తులు పట్టుకుని రోడ్లపై తిరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీసుల ప్రత్యేక నిఘా ఉంటుందని, మీ ప్రాంతంలో ఏం జరిగినా బాధ్యులు మీరే అవుతారని, ప్రశాంతంగా ఉండటానికి తమ వంతుగా ప్రయత్నించాలని సూచించారు. కార్యక్రమంలో డీఐ నాయుడు, ఎస్ఐలు తదితరులు ఉన్నారు.

దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్యకు శుభాకాంక్షలు

మలక్‌పేట : నల్గొండ చౌరస్తాలోని దివ్యాంగుల రాష్ట్ర సహకార సంస్థ కార్యాలయంలో బుధవారం దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్‌గా ముత్తినేని వీరయ్య పదవీ బాధ్యతలు చేపట్టారు. పంచాయతీరాజ్, మహిళా, శిశు, దివ్యాంగుల సంక్షేమశాఖ మంత్రి సీతక్క, పౌర సరఫరాలు, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, నవీన్‌కుమార్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి, ఫెడ్ చైర్మన్ ఎం.గంగారాం, తదితరులు వీరయ్యను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

లింగోజిగూడ అభివృద్ధే లక్ష్యం : కార్పొరేటర్

లింగోజిగూడ డివిజన్‌లో రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి

చంపాపేట, జూలై 10: లింగోజిగూడ డివిజన్‌ను నగరంలోనే నంబర్‌వన్ డివిజన్‌గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ జీహెచ్‌ఎంసీ ఫ్లోర్‌లీడర్, కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని అల్తాఫ్‌నగర్, శ్రీనివాసకాలనీలో కొనసాగుతున్న రోడ్డు నిర్మాణ పనులను బుధవారం కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. డివిజన్‌లో ఎక్కడ సమస్య తలెత్తినా తన దృష్టికి తీసుకు రావాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఆయా కాలనీవాసులు జనార్దన్‌రెడ్డి, జంగారెడ్డి, వెంకట్‌రెడ్డి, మహేందర్, కిరణ్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, జంగయ్యగౌడ్, సురేశ్, రాజు, రవి, నాగేశ్వర్‌రావు, జానకి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

దాసుపైలాపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

డీసీపీ ప్రవీణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న వక్కలంక శ్రీనివాస్‌రావు, తదితరులు

ఆర్కేపురం, జూలై 10 : ఫేస్ బుక్ మాధ్యమంలో బ్రాహ్మణులపై అనుచిత వ్యాఖలు చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పార్వతీపురానికి చెందిన దాసుపైలాపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బుధవారం తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమైక్య ప్రాంతీయ కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం శ్రీనివాస్‌రావు విలేకరులతో మాట్లాడుతూ దాసుపైలా బ్రాహ్మణులను పరుష పదజాలంతో ధూషించాడని అన్నారు. దాసుపైలా మాటలకు బ్రాహ్మణుల మనోభావాలు దెబ్బతిన్నాయని, వెంటనే అతడిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కార్యనిర్వాహ కార్యదర్శి జయతులసి, హైదరాబాద్ ఉపాధ్యక్షుడు బనిగిరి నాగరాజ్, కోశాధికారి రఘునందన్, కార్యవర్గ సభ్యులు ఎంవీ రమణరావు, శశి, తదితరులు ఉన్నారు.

ఎల్ఐసీ చైతన్యపురిశాఖ ఆఫీస్ బేరర్ల కమిటీ



ఎల్ఐసీ చైతన్యపురిశాఖ ఆఫీస్ బేరర్ల నూతన కమిటీ సభ్యులు

చంపాపేట, జూలై 10 : ఎల్ఐసీ సీబీ16 విభాగం చైతన్యపురి(1964)శాఖ 15వ ఆఫీస్ బేరర్ల నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కర్మన్‌ఘాట్ డిఫెన్స్ కాలనీకి చెందిన గోగిరెడ్డి అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా టీ దాసయ్య, కోశాధికారిగా డి వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని లియాఫీ భవన్‌లో మంగళవారం రాత్రి బ్రాంచి అధ్యక్షుడు వి జంగయ్య అధ్యక్షతన జనరల్‌బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ టర్మ్‌నల్‌ను విజయవంతంగా పూర్తి చేయాలని లియాఫీ అఖిల భారత సెక్రెటరీ జనరల్ ఎస్‌బీ శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు(హెచ్‌క్యూ)ఎంఎస్ మూర్తి, శ్రీరాం, భీష్మపితామహ బీఎన్ చారి కోరారు. కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ చింతల వెంకట్‌రెడ్డి, సెక్రెటరీ సుదర్శన్, కోశాధికారి గూడె శీనయ్య, మాజీ డివిజన్ అధ్యక్షుడు సీతయ్య, మాజీ సెక్రెటరీ ఉపేందర్‌రెడ్డి, మాజీ కోశాధికారి సతీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'తెలంగాణ కౌన్సిల్‌ను రద్దు చేయండి'

- న్యాయవాది రాపోలు భాస్కర్

సైదాబాద్, జూలై 10 : భారత రాజ్యాంగ నియమాలకు విరుద్ధంగా కొనసాగుతున్న తెలంగాణ రాష్ట్ర శాసనమండలిని అత్యవసరంగా రాష్ట్రపతి, గవర్నర్ జోక్యం చేసుకుని రద్దు చేయాలని హైకోర్టు న్యాయవాది రాపోలు భాస్కర్ విజ్ఞప్తి చేశారు. బుధవారం సైదాబాద్ డివిజన్ పరిధిలోని కల్యాణ్‌నగర్ కాలనీలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగంలోని 105 సవరణ ద్వారా 2020లో ఆంగ్లో ఇండియన్ సభ్యులను రద్దు చేయడంతో తెలంగాణ అసెంబ్లీ సభ్యులు 119 ఉండగా, ఆ ప్రకారం ఎమ్మెల్యేల సంఖ్యకు 1/3వ వంతు అనగా 40 మంది కౌన్సిల్ సభ్యుల నుంచి 39 మందికి పడిపోయిందన్నారు. దీంతో రాజ్యాంగం ప్రకారం 40మంది కంటే తక్కువ కాకుండా ఉంటేనే కౌన్సిల్ అని 171 చట్టంలో వివరిస్తున్నదని తెలిపారు. 2023 డిసెంబర్ 7 తర్వాత కొత్త అసెంబ్లీ ఏర్పాటైనప్పటి నుంచి శాసనమండలి కౌన్సిల్ సభ్యులకు ఖర్చుకు, విధులకు చట్టభద్రతలేదని వెల్లడించారు.

ఆరుగురు జూదగాళ్ల అరెస్ట్

బడంగ్‌పేట, జూలై 10 : పేకాట స్థావరంపై బుధవారం ఎస్‌వోటీ పోలీసులు, మీర్‌పేట పోలీసులు సం యుక్తంగా దాడులు నిర్వహించారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడ అర్పితా ఎన్‌క్లేవ్‌లో పేకాట ఆడుతున్నట్లు ఎస్‌వోటీ పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు దాడి చేసి పలువురిని అదుపులోకి తీసుకున్నారు. గుర్రం వెంకట్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, అనిల్‌రెడ్డి, ఆర్ శ్రీనివాస్‌రావు, రమేశ్‌రెడ్డి, కృష్ణమూర్తిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి నుంచి ప్లేయింగ్‌కార్డులు, రూ. 25,120 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రాంబాబు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

ఉప్పల్, జూలై 10: ఉప్పల్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలను జీహెచ్‌ఎంసీ అధికారులు బుధవారం కూల్చివేశారు. హనుమసాయినగర్, సరస్వతికాలనీ, రామంతాపూర్, తదితర ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన నిర్మాణాలను కూల్చివేశారు.

అధ్వానం.. జైత్వారం-గపూర్‌నగర్ రహదారి

- గుంతలమయంగా మారి ఇబ్బందులు పడుతున్న ప్రజలు

గుంతలు పడి అధ్వానంగా మారిన జైత్వారం-గపూర్‌నగర్ రోడ్డు

కందుకూరు, జూలై 10 : గతంలో ఆర్టీసీ బస్సులు నడిచిన మండలంలోని జైత్వారం-గపూర్‌నగర్ మట్టిరోడ్డుపై ప్రస్తుతం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని దుస్థితి నెలకొంది. రోడ్డు గుంతలమయంగా మారడంతో అటు రైతులు, ఇటు ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. మండలంలోని జైత్వారం గ్రామం నుంచి గపూర్‌నగర్ వరకు రెండు కిలోమీటర్ల మేర ఉన్న రహదారి పూర్తిగా గుంతలమయంగా మారింది. వర్షాకాలంలో పరిస్థితి మరింత జఠిలంగా తయారైంది. గుంతల్లో నీరు నిలిచి వాహనాలు ముందుకు కదలలేకుండా ఉన్నాయి.

23 ఏండ్ల క్రితం పనికి ఆహార పథకం కింద రెండు గ్రామాల మధ్య ఈ రోడ్డు నిర్మించారు. తిరిగి అప్పుడప్పుడూ మట్టిపోసి మరమ్మతులు చేయించారే కాని శాశ్వత రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. దాంతో ఆర్టీసీ బస్సు సర్వీసును సంబంధిత అధికారులు రద్దు చేశారు. నాటి నుంచి కూరగాయలు అమ్ముకునే రైతులు, సాధారణ ప్రయాణికులు ఈ రోడ్డుపై ప్రయాణించాలంటేనే జంకుతున్నారు. అదేవిధంగా జైత్వారం నాయినివాని చెరువు నిండి అలుగు పోసే సమయంలో అటు గపూర్‌నగర్, ఇటు కేకే బస్తీ వెళ్లే రైతులకు ఇక్కట్లు తప్పడం లేదు. అలుగు ప్రాంతంలో బ్రిడ్జి లేక నీళ్లలోంచే ప్రయాణించాల్సిన దుస్థితి. వర్షం పడినప్పుడు రోడ్డుపై బురదమయంగా మారుతుంది. వెంటనే రోడ్డు మరమ్మతులను చేయించి బ్రిడ్జి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

శాశ్వత మరమ్మతులు చేపట్టాలి

ప్రభుత్వం నిధులు మంజూరు చేసి బీటీ రోడ్డు నిర్మించాలని చేపట్టాలని జైత్వారం తాజా మాజీ సర్పంచ్ సదాలక్ష్మీపుల్లారెడ్డి అన్నారు. అలుగు ప్రాంతంలో బ్రిడ్జి సైతం నిర్మించాలని ఆమె పేర్కొనారు.

ప్రతిపాదనలు పంపాం.

జైత్వారం నుంచి గపూర్‌నగర్ రోడ్డు అభివృద్ధికి ప్రతిపాదనలు తయారు చేసి పై అధికారులకు పంపించాం. అలుగు ఉన్న చోట లోలెవల్ బ్రిడ్జి నిర్మించాలి. త్వరలో నిధులు మంజూరయ్యే అవకాశం ఉన్నది. ఆ వెంటనే పనులను ప్రారంభిస్తాం.

ఎం, సతీశ్‌రెడ్డి, పీఆర్ ఏఈ, కందుకూరు మండలం

వివిధ కోర్సుల పరీక్షా ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 10: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్, ఎంఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్, లా విభాగంలో పీజీ డిప్లొమా కోర్సుల మొదటి, రెండో సెమిస్టర్, ఎల్‌ఎల్‌ఎం తదితర కోర్సుల ఫలితాలు విడుదల చేశారు. ఫలితాలకు ఓయూ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని ఆయన సూచించారు.

పలు కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ

ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు. ఎమ్మెస్సీ మాలిక్యులర్ అండ్ హ్యూమన్ జెనిటిక్స్ రెండు, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును ఈ నెల 15 లోపు సంబంధిత కళాశాలల్లో చెల్లించాలి. రూ.300 అపరాధ రుసుముతో18వ తేదీ వరకు చెల్లించవచ్చు. అన్ని విభాగాల బీఈ (ఏఐసీటీఈ) రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, బీఈ బ్రిడ్జి కోర్స్ రెండో సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షా ఫీజును ఈ నెల 15లోపు సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని తెలిపారు. రూ.200 అపరాధ రుసుముతో 19వ తేదీ వరకు చెల్లించాలని సూచించారు. పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నారు.

బీఈ కోర్సులకు వన్‌టైం చాన్స్..

ఓయూ పరిధిలోని అన్ని విభాగాల బీఈ కోర్సులు పూర్తి చేసి బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు మిగిలిపోయిన వారికి వన్‌టైమ్ చాన్స్ కల్పించినట్లు అధికారులు తెలిపారు. 2 వేల సంవత్సరం తరువాత ఆయా కోర్సుల్లో చేరినవారు సైతం తమ బ్యాక్‌లాగ్ పరీక్షలకు హాజరయ్యేందుకు అవకాశమిచ్చామన్నారు. ఈ కోర్సుల సెమిస్టర్ల పరీక్షా ఫీజును ఈ నెల 15 లోపు, రూ.200 అపరాధ రుసుముతో 19 లోపు కళాశాలల్లో చెల్లించాలి. అన్ని కోర్సుల పరీక్షలకు సాధారణ పరీక్ష ఫీజుతో పాటు పెనాల్టీ చెల్లించాలి. ప్రస్తుతం ఉన్న సిలబస్, పరీక్షా విధానంలోనే హాజరుకావాలి.

వివిధ కోర్సుల పరీక్షా తేదీల ఖరారు..

ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా తేదీలను అధికారులు ఖరారు చేశారు. బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ రెండో సెమిస్టర్ మెయిన్, మొదటి సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలను ఈ నెల 16 నుంచి, ఎమ్మెస్సీ మాలిక్యులర్ అండ్ హ్యూమన్ జెనిటిక్స్ రెండో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను 23 నుంచి, బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల రెండు, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, నాలుగో సెమిస్టర్ ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలను వచ్చే నెల 6 నుంచి నిర్వహించనున్నారు.

దూరవిద్య పీజీ పరీక్షలు వాయిదా..

ఓయూ దూరవిద్యా కేంద్రమైన ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్‌ఆర్‌సీడీఈ) ద్వారా అందించే అన్ని పీజీ కోర్సుల పరీక్షలను అధికారులు వాయిదా వేశారు. ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ కోర్సుల మొదటి, రెండో సంవత్సరం పరీక్షలను బుధవారం నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించినప్పటికీ వాటిని వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలను తిరిగి నిర్వహించబోయే తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని, పూర్తి వివరాలకు ఓయూ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు.

ప్రతిభ గల క్రీడాకారులను తయారు చేయాలి

శామీర్‌పేట, జూలై 10: స్పోర్ట్స్‌లో రాష్ట్ర, దేశ ఖ్యాతిని ఎల్లలకు చాటే ప్రతిభావంతులైన క్రీడాకారులను తయా రు చేయడమే లక్ష్యంగా స్పోర్ట్స్ స్కూల్‌లో కృషి చేస్తున్నాయని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ(సాట్) వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బాలాదేవి ఐఎఫ్‌ఎస్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర క్రీడా పాఠశాలలో 2024-25వ విద్యా సంవత్సరానికి 4వ తరగతి ఎంపికలకు గాను తూంకుంట మున్సిపాలిటీ హకీంపేటలోని తెలంగాణ రాష్ట్ర క్రీడాపాఠశాలలో రాష్ట్రస్థాయి సెలక్షన్స్ బుధవారం మూడవ రోజు కొనసాగించారు. ఈ సెలక్షన్స్‌ను స్కూల్ ఓఎస్‌డీ సుధాకర్‌రావుతో కలిసి పరిశీలించి, పలు సూచనలు చేశారు. సెలక్షన్స్ కోసం వచ్చిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని సూచించారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి

శ్రీ త్రివేణి పాఠశాలలో నిర్వహించిన ఇన్వెస్టిచర్ డేలో పాల్గొన్న విద్యార్థులు

ఆర్కేపురం, జూలై 10 : సరూర్‌నగర్ డివిజన్‌లోని శ్రీత్రివేణి పాఠశాలలో బుధవారం ఇన్వెస్టిచర్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రమాణ స్వీకారం, నూతన విద్యార్థి మండలి సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. పాఠశాల హెడ్ బాయ్‌గా కార్తిక్), హెడ్ గర్ల్‌గా మనస్వి, స్పోర్ట్ కెప్టెన్‌గా విఘ్నేశ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటి నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సునీల్, యోగేశ్వరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జలమండలి అధికారుల తీరు సరైంది కాదు..



బాలాజీనగర్‌కాలనీ జాన్సన్‌గ్రామర్ స్కూల్ వద్ద సివరేజ్ మ్యాన్‌హోల్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కే.నర్సింహారెడ్డి

మన్సూరాబాద్, జూలై 10: జలమండలి అధికారులు కక్షసాధింపు చర్యలకు పాల్పడటం సరైంది కాదని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. నాగోల్ డివిజన్ బాలాజీనగర్‌కాలనీలోని జాన్సన్ గ్రామర్ స్కూల్‌కు సంబంధించిన సివరేజ్ వ్యవస్థను బుధవారం ఉదయం జలమండలి సిబ్బంది బ్లాక్ చేస్తుండగా అక్కడి చేరుకున్న ఆయన హెచ్‌ఎండబ్ల్యూఎస్, ఎస్‌బీ సిబ్బందిపై మండిపడి పనులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఎల్బీనగర్‌లోని కొందరు జలమండలి అధికారులు సివరేజ్ పనుల మాటున అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పాఠశాల నడుస్తుండగా డ్రైనేజీని పూడ్చివేస్తే విద్యార్థుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. అధికారులు కక్షపూరితంగా వ్యవహరించడాన్ని ఆయన ఖండించారు. ఆయన వెంట లక్ష్మయ్య, గోపాల్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి ఉన్నారు.